## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

తాంసి(తలమడుగు), డిసెంబర్ 17 : మండలంలోని కుచులాపుర్ గ్రామానికి చెందిన రాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. వారికి సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారితోపాటు ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎంపీ గొడం నగేష్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# బాబోయ్ కుక్కలు

- గ్రామాల్లో స్వైర విహారం
- బెంబేలెత్తుతున్న ప్రజలు, మహిళలు, చిన్నారులు



కుభీర్‌లోని ప్రధాన రహదారిపై సంచరిస్తున్న కుక్కలు

కుభీర్, డిసెంబర్ 17: కుభీర్ మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో కుక్కలు విపరీతంగా పెరిగి పోయి స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వాటి సంతతిని నియంత్రించాలని సర్పంచులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈయేడాది మండలంలో కుక్కల దాడిలో గాయ పడ్డ వారి సంఖ్య 68కి చేరింది. మండలకేంద్రంలోనే 13 మంది గాయపడ్డారు. ఇందులో ఎక్కువ సంఖ్యలో చిన్నారులు ఉండడం గమనార్హం. ఇందుకు గాను గ్రామ పంచాయతీలు శునకాలను పట్టి యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ (ఏబీసీ) కేంద్రాల సిబ్బందితో యాంటీ రేబిస్ ఇంజక్షన్లు వేయించాలి. అయినప్పటికీ ఈ దిశగా చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలున్నాయి. మండలంలోని 41 జీపీల్లో సుమారు 4600 శునకాలు ఉన్నట్లు ప్రాథమిక అంచనా. ఈసంఖ్య ప్రతియేటా పెరుగుతూ పోతోంది. రోడ్లపై వెళ్లేవారిపై ఒక్కసారిగా దాడి చేస్తూ భయాందోళన సృష్టిస్తున్నాయి. అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## విద్యుత్తీగల చోరీ



కోసేసిన తీగలు

ఖానాపూర్ రూరల్, డిసెంబర్ 17: ఖానాపూర్ శివారులోని దిలావ ర్‌పూర్ రోడ్డు రెంకోని వాగు సమీపంలో విద్యుత్ స్తంభాలకు అమర్చి న విద్యుత్తీగలను గుర్తుతెలియని దుండగులు దొంగలించినట్లు రైతులు దాసరి పోశన్న, ఆకుల శ్రీనివాస్, నాగుల పోశన్న, ఆకుల భీమేశ్, బో డ భీమన్న తెలిపారు. గత వానకాలం భారీ వర్షాలు కురవడంతో వా గు ఒడ్డుపై ఉన్న ట్రాన్స్ ఫార్మర్ కొట్టుకపోయిందన్నారు. విద్యుత్ సర ఫరా లేదని తెలుసుకున్న దుండగులు స్తంభం పైకి ఎక్కి సుమారు 300 మీటర్ల విద్యుత్తీగలను దొంగలించినట్లు తెలిపారు. పది రోజుల క్రితమే విద్యుత్తీగలను దొంగలించినా అధికారుల పర్యవేక్షణ లేదన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి రైతులకు సకాలంలో విద్యుత్ సరఫరాను అందించాలని కోరారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా ఏర్పాటు చేసి యాసంగి పంటకు సహకరించాలని కోరారు.

## ట్రాక్టర్ బోల్తా, ఒకరి మృతి



యోగేశ్

భైంసాటౌన్, డిసెంబర్, 17 : మండలంలోని దేగాం గ్రామ శివారులో ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందారు. స్థానికులు, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం ట్రాక్టర్ యజమాని బొగ్గుల పోతన్న తన కొడుకు యోగేశ్ (16) తో కలిసి యాసంగికి సొంత పొలం దున్నడానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో గ్రామ శివారులోని చెరువు కట్టపై నుంచి వెళ్తుండగా, ముళ్ల పొదలను తప్పించే క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో యోగేశ్ అక్కడికక్కడే మృతి చెందగా తండ్రి పోతన్న స్వల్పగాయాలతో బయటపడ్డాడు. యోగేష్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న పీడీఎస్ బియ్యం

లోకేశ్వరం, డిసెంబర్, 17: మండల కేంద్రంలో ముందస్తు సమాచారం మేరకు అక్రమంగా నిల్వ ఉంచిన 6 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. బియ్యం ఎవరిదని విచారణ చేపట్టగా, షేక్ సమైర్ అక్కడ ఉంచినట్లు తెలిసింది. వెంటనే బియ్యం బస్తాలను సంబంధిత శాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

# బో'నమో' మల్లన్న

- గ్రామాల్లో షష్ఠి బోనాల సందడి
- పట్నాలు, ఒగ్గుకథలు
- ఊరూరా ఆధ్యాత్మికత పరిమళాలు

నెన్నెల,డిసెంబర్19: పల్లెల్లో మల్లన్న బోనాల సందడి నెలకొంది. ఏటా కార్తీక మాసం ముగిసి మార్గశిర అమావాస్య నుంచి ప్రారంభం కావడంతో గ్రామాల్లో మల్లన్న బోనాల సందడి కనిపిస్తుంది. ఏడు వారాల పాటు బోనాల సందడి ఉంటుంది. బోనాలు, కథలు, పట్నాలు, శివ మల్లన్న కళ్యాణం శివరాత్రి వరకు ఆది, బుధవారాల్లో మల్లికార్జుడికి భక్తులు పసుపు బంగారంతో మొక్కులు తీర్చుకుంటూనే ఉంటారు. అమావాస్య రోజు నుంచే గ్రామాల్లో బోనాల కోసం భక్తి శ్రద్ధలతో వారాలు పట్టుకుంటారు. వారాలు పట్టడం అంటే షష్టి ఏడు వారాల పాటు ఇంట్లో భక్తి శ్రద్ధలతో నియమాలు పాటిస్తారు. అమావాస్య ప్రారంభం అయిన రోజు నుంచి భోనాలు పోసే వరకు నియమంగా ఉండి మొదటి బోనంను ఇంటి ఆరాధ్య దైవంగా కొలుచుకునే మల్లికార్జుడికి పోసి మొక్కులు చెల్లిస్తారు. శివ మల్లన్నకు భక్తులు ఒగ్గు కళాకారులతో కథలు చెప్పిస్తారు. మూడు రోజులు, ఐదు రోజులు, ఏడు రోజులు ఇలా కథలను బట్టి భక్తులు మొక్కలు తీర్చుకుంటారు. కల్యాణం,చిన్నపట్నం,పెద్ద పట్నం,అన్నసంతర్పణలు చేస్తుంటారు.నిలువెత్తు బంగారం దేవునికి తులాబారం వేసి మొక్కులు తీర్చుకుంటారు.



బోనాలు పోసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

### భక్తిశ్రద్ధలతో భోనాలు

మల్లమన్న భోనాలు ఎంతో భక్తి శ్రద్ధలతో నియమ నిష్టలతో ఉండి మొక్కులు తీర్చుకుంటారు. షష్టి బోనాలు అయ్యేవరకు ఇంట్లో వారు పాలు, పెరుగు, నెయ్యి, మందు, మాంసానికి దూరంగా ఉంటారు. పాడి ఉన్నవారు ప్రతి రోజూ మడి బట్టలతో పాలు పితుకుతారు. ఇలా ఇంటిలో మొదటి బోనం పోసేవరకు నియమాలతో ఉంటారు. మొదటి పంట పండిన వరిధాన్యాన్ని భక్తులు ధాన్యం కుప్ప నుంచే దేవుడి పేరిట ధాన్యం తీసి బియ్యం తయారు చేసి బెల్లం, పాలతో బోనం తయారు చేస్తారు. బోనంపై కూడా తాళింపు లేని కూరలను వండుతారు. బోనాలను బంతిపూలు, మామిడితోరణాలతో అలంకరిస్తారు. బోనం వంటలు రాగి, ఇత్తడి పాత్రలో లేకపోతే మట్టి కుండలలోనే వంటలు వండుతారు. స్టీలు, అల్యూమినియం పాత్రలలో శివ మల్లన్న కు భోనాలు చేయరు. గుగ్గిలం, మైశాక్షీతో దేవునికి సాంబ్రాణి పోగ వేస్తారు. మొదటి వారం ఇంటిలో భోనాలు పోసి మరో వారం సమీపంలో ఉన్న శివ మల్లన్న ఆలయాలలో భోనాలు పోసి మొక్కులు చెల్లిస్తారు. శివ మల్లన్న పట్నాలు అత్యంత నిష్టతో నిర్వహిస్తారు.

శోభాయ మానంగా పట్నాలు:

నైపుణ్యం కలిగిన కళాకారులు చిన్నపట్నం, పెద్ద పట్నం.స్వామి వారి కల్యాణం, నాగవెల్లి కి సంబంధించిన పట్నాలను వేస్తారు. పసుపు, కుంకుమ, తెల్లపిండి,తంగేడుఆకు పొడి,పలు రకాల రంగులతో ప్రత్యేకమైన పలకలతో పట్నాల చిత్రాలను నేలపై వేస్తారు. వివిధ రూపాలలో పట్నాలను అందంగా వేస్తారు. పూలతో ఆలంకరిస్తారు. పట్నాలు వేసి మల్లన్న దేవుని కల్యాణం నిర్వహిస్తారు. ఇలా పల్లెల్లో ఎక్కడ చూసిన ఇంటిలో మల్లన్న ఆలయాల్లో ఈ పట్నాల వేడుకలు జరుగుతుంటాయి. కొందరు భక్తులు మల్లన్న పట్నాలను గోదావారి నదిలో కూడ వేస్తారు. దానినే గంగప్నటం అని కూడా అంటారు.

# సిలిండర్ పేలి మహిళ మృతి



ద్రుపదాబాయి

భైంసాటౌన్, డిసెంబర్ 17: మండలంలోని కామోల్ గ్రామానికి చెందిన ద్రుపదబాయి (50) శనివారం రాత్రి వంట గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగడంతో, అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రోజూ మాదిరిగానే రాత్రి భోజనం చేశాక భర్త లింగన్న గ్రామంలోని రామాలయంలో భజన కార్యక్రమానికి వెళ్లాడు. ద్రుపదబాయి ఇంట్లో ఉంది. రాత్రి 11 గంటలకు నిద్రిస్తున్నప్పుడు ప్రమాదం చోటు చేసుకుంది. ఒక్కసారిగా ఏదో పేలినట్లు పెద్దశబ్దాలు వచ్చాయి. క్షణాల్లో మంటలు ఇళ్లంతా (రేకుల షెడ్డు) వ్యాపించడంతో ద్రుపదాబాయి మంటల్లో సజీవదహనమైంది. సిలిండర్, స్టౌ గాల్లో ఎగిరి వేరే వీధుల్లో పడ్డాయి. ఇంట్లోని వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.



కామోల్‌లో ద్రుపదాబాయి ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

## ప్రభుత్వ పాఠశాలలో అగ్ని ప్రమాదం

లక్షెట్టిపేట, డిసెంబర్ 17: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని ఉన్నత పాఠశాలలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. సెలవు దినం కావడంతో పాఠశాలకు తాళం వేసి ఉంది. కిటికీల్లోంచి దట్టమైన పొగలు వ్యాపించడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పట్టణ ఎస్ఐ లక్ష్మణ్ ఘటనా స్థలానికి చేరుకుని కళాశాల గేట్ తాళం పగులగొట్టి లోనికి వెళ్లి చూసే సరికి దట్టమైన మంటలతో తరగతి గదులు కాలిపోతున్నాయి. ధర్మపురి నుంచి వచ్చిన ఫైరింజన్ మంటలను అదుపులోకి తెచ్చింది. పాఠశాల ల్యాబ్ గదితో పాటు మరో మూడు తరగతి గదుల్లోకి మంటలు రావడంతో ల్యాబ్ పరికరాలు, బెంచీలు, బుక్స్, ఫర్నిచర్ పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ముఖ్యంగా లక్షెట్టిపేట పట్టణంలో ఫైర్‌స్టేషన్ లేకపోవడంతోనే అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఫైర్ స్టేషన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, శంకరయ్య, హైమద్‌ఖాన్‌ను పాఠశాల సిబ్బంది, పట్టణ ప్రజలు అభినందించారు. ప్రమాదానికి కారణాలు తెలియలేదు. విద్యుదాతమా, ఇతర కాణమేదైనా ఉందా అనే కోణం లో విచారణ చేపడుతున్నారు.



ప్రభుత్వ పాఠశాలలో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677